# ఇన్లాండ్ లెటర్ కథలు

## పిచ్చోడు

శ్రీపతికి తన స్నేహితుడొకడు మెంటల్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. స్నేహితుని చూసినట్లుంటుంది, ఎవ్వరూ చూడని మెంటల్ ఆసుపత్రి కూడ చూడచ్చనుకొన్నాడు. మెంటల్ ఆసుపత్రి గేట్ వద్ద వాడిపేరు చెప్పగానే లోపలికి పోనిచ్చాడు. వాకబు చేసుకుంటూ వెళ్ళి తన స్నేహితుడైన సూరిని కలిసాడు. శ్రీపతిని చూస్తూనే సూరి లేచొచ్చి ఎంతో సంబరంతో వాడి చేతులు పట్టుకొని "ఎప్పుడొచ్చావురా?" అంటూ బయటకు తీసుకొచ్చాడు. ఒకరికొకరు క్షేమసమాచారములు చెప్పకొన్నారు.

"శ్రీపతి! ఒక్క ఐదు నిమిషాలిక్కడే నిలబడు. పర్మిషన్ తీసుకొస్తాను. మా యింటికెళ్దాము. ఇక్కడకు చాలా దగ్గరే" అంటూ పర్మిషన్ కొరకెళ్ళాడు.

ఇంతలోకి ఎవరో ఒకతను వచ్చి "నమస్కారం మాష్టారూ! ఆసుపత్రి చూద్దానికొచ్చినట్లున్నారు." అతన్ని ఎగాదిగా చూసాడు. మనిషి చాల నీట్‌గా డ్రెస్ చేసుకున్నాడు. జంటిల్‌మన్‌లాగె ఉన్నాడు.

"అబ్బే! మా స్నేహితుని గురించి వైట్ చేస్తున్నాను!"అన్నాడు శ్రీపతి.

"మాష్టారూ! నాది విజయవాడ. నేను మద్రాసులో చాలాకాలం ఉన్నాను. డైరెక్టర్సు మధుసూదనరావు, బి.ఎ. సుబ్బారావు, ఆదుర్తి మొదలగు వారితో పని చేసానండి అన్నాడు ఆ అపరిచిత వ్యక్తి.

"ఓహో అట్లాగా" అన్నాను. అతని ముఖంలోకి చూస్తూ 'పలాని డైరెక్టరు మీకు తెలుసా?' అన్నాడు.

"నాకు తెల్దండి"

"పలాని సినిమా డైరెక్ట్ చేసాడు. ఆ సినిమా వందరోజులాడింది"

"ఆ..ఆ..ఆసినిమా చూసాను. చాలాబాగుంది" అన్నాడు శ్రీపతి.

నవ్వుతూ "ఆసినిమాకు మాటలు, పాటలు రాసింది నేనే. కాని డైరెక్టరుగారు అన్నీ తనేనని తనపేరు వేసుకొని నాపేరెక్కడ లేకుండ చేసాడు.

"అయ్యో! ఎంతమోసం. మీరూరుకున్నారా?" బేలగా అన్నాడు. "ఆ..నేనూరుకుంటానా, కోర్టుకెళ్ళాను. కేసు కోర్టులో వున్నది."

"మాస్టారూ! సినిమా ఫీల్డంత మాయ ఇంకొకటి లేదండి. ఒకడిని మాపి ఇంకొకడు పైకి రావడమే. సినిమా లోకమంతా ఘోస్టు రైటర్సు, ఘోస్టు డైరెక్టర్సు". ఇంకా ఏదేదో సినిమా ఇండస్ట్రీని దుమ్మెత్తిపోస్తూ నడస్గా ఆగాడు.

"మాష్టారూ? మీ వద్ద ఐదు రూపాయలు న్నాయా?" శ్రీపతి ఏదో చెప్పబోతుంటే "ఆగండి! ఆగండి! నేను ఇక్కడున్న మా. పేషెంటును చూద్దానికొస్తుంటే బస్సులో నా పర్సు కొట్టేసారు" దీనంగా యింకేదో చెప్పబోతుంటే, అతన్ని వదిలించుకుందామని శ్రీపతి "ఉండండి మాష్టారూ! అని జేబునుండి ఐదు రూపాయల నోటు తీసిచ్చాడు. వినయంగా వంగి" థాంక్స్ మాష్టారు! ఎక్కడో చోట ఎదురుపడకపోము మీ బాకీ పూవుల్లోపెట్టి తీరుస్తాను" అంటూ గబా, గబా జారుకున్నాడు.



సూరి వస్తూనే "పదరామా ఇంటికెళ్దాము" శ్రీపతి "అరె! సూరి! ఆ వెళ్ళేవాడ్ని చూడు. అతడో సినిమాకవట. ఇక్కడెవరో అతని పేషంటున్నాడట. నీకు తెలుసా అతను?"

సూరి కళ్ళు చికిలించి చూచి అహ్హా..హా...అని నవ్వి "వాడు మా పేషంటే. నీ బుర్ర తినేసుంటాడే"

"వాడు నా బుర్ర తినేయడమేటిరా బాబు! వాడి మాటలతో మెస్మరైజ్ చేసి నా వద్ద ఐదు రూపాయలు కొట్టేసాడురా!"

"అదీ ఒకరకమైన పిచ్చి. అతితెలివి. ఎదుటివారిని బోల్తా కొట్టించడం..మాయ చేయడం. ఎందుకట్లా చేసావురా? అని అడిగితే మాటామంతి లేకుండ మౌనంగా ఉండిపోవటం తనలో తనే నవ్వుకుంటూ"

"అరె సూరి! వాడు పిచ్చోడంటే నమ్మలేంరా! నన్నే పిచ్చోడ్ని చేసాడు గదరా! ఎవ్వరికైనా పిచ్చోడని చెప్తే నవ్విపోతారుగదరా!"

సూరి పకపకా నవ్వుతూంటే, శ్రీపతి కూడ ఏడ్వలేక వాడితో పాటు నవ్వుతూ ఇద్దరూ సూరింటికెళ్ళారు.

— పి.నాగేశ్వరరావు.

---

## డబ్బు

బస్టాపులో నిలబడి వున్న సరితకు క్షణం క్రితం జరిగిన సంఘటన పదే పదే గుర్తుకు రాసాగింది. పన్నెండేళ్ల పిల్లవాడు తన పర్స్ కొట్టేయబోయి పట్టుబడడం. అక్కడి జనమంతా వాడిని చితక బాదడం, వాడిని పోలీసులకు అప్పగిస్తాం అంటే తను వాళ్ళని వారించి, ఆ పిల్లవాడిని విడిపించడం అదంతా గుర్తు చేసుకుంటుంటే ఆమెకు చాలా థ్రిల్‌గా అనిపించింది. తన పర్స్ కొట్టేయబోయిన వాడిని క్షమించి వదిలిపెట్టడం ఆమెకే గొప్ప సంతృప్తిని మిగిల్చింది. ఇంతలో బస్సు రావడంతో ఆమె ఆలోచనలకి స్టాప్ పెట్టి బస్సెక్కింది.

సరిత చెప్పింది విన్న వినోద్ అదేదో జోక్‌లాగా నవ్వి "పెద్ద ఘనకార్యం చేసావులే. పర్స్ కొట్టేసిన వాడిని క్షమించి వదిలేసావా! ఇంకా నయం పర్స్ కూడ ఇచ్చి పంపలేదు. వాడు మళ్ళీ ఎవరి పర్స్ కొట్టేస్తాడో, ఏమో!" అన్నాడు. భర్త అలా అనేసరికి సరితలో అప్పటివరకు ఉన్న ఆనందం కాస్త ఎగిరిపోయింది. నిజంగా తను చేసింది మంచి పనేనా లేక వాడు భవిష్యత్‌లో ఇంకా ఎన్నో దొంగతనాలు చేయడానికి తను కారణమయిందా?

మరునాడు సాయంత్రం భర్తతో కలిసి సరదాగా బయటకు వెళ్ళింది సరిత. భర్తతో గడిపిన ఆ కొంత సమయం ఎంతో సరదాగా గడిచిపోయింది. ఇంటికి వెళ్ళడానికి తయారవుతుంటే వినోద్ "సరితా అక్కడ అంతమంది గుమ్మిగూడారే ఏమయింది" అన్నాడు. నిజమే అక్కడ చాలా జనం గుంపుగా వున్నారు. ఏం జరిగిందో తెలుసుకోవాలన్న కుతూహలంతో వినోద్‌తో పాటు అక్కడికి వెళ్ళిన సరిత అక్కడి దృశ్యం చూసి ఒక్కసారిగా అవాక్కయింది. నిన్న తన పర్స్ దొంగిలిస్తూ పట్టుబడ్డ పన్నెండేళ్ళ పిల్లవాడు ఆ జనం మధ్యలో ఏడుస్తూ కూర్చున్నాడు. వాడి ప్రక్కనే ఓ స్త్రీ మూర్తి దేహం నిర్జీవంగా పడివుంది. బహుశా వాడి తల్లి అయిఉంటుంది. సరితను ఆ పిల్లవాడు గమనించినట్లున్నాడు. "అమ్మగారు మా అమ్మను ఆస్పత్రికి తీసుకువెళ్ళడానికి డబ్బులేక మీ పర్స్ కొట్టేయడానికి ప్రయత్నించానండి. నేను నిజంగా దొంగను కాదండి. చివరకు మా అమ్మను దక్కించుకోలేకపోయానండి అంటూ....వాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

డబ్బును 'లక్ష్మీదేవి'ని పూజిస్తారు, గౌరవిస్తారు. కాని అలాంటి డబ్బు ఈ రోజు ఒక అమాయక ప్రాణాన్ని బలి తీసుకుంది. ఒక పసివాడిని అనాథనే చేసింది. వాడికి 'దొంగ' అనే ముద్ర వేసింది. సరితకు ఒక్కసారిగా డబ్బు మీద అసహ్యం వేసింది.

— యన్.శ్రీనివాస్